ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 4 మార్చి 2024

పలాస టు చెన్నై

● గారబంద మీదుగా చేరుతున్న గంజాయి

పలాస, మార్చి 3: ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరిలో పండించే గంజాయిని గారబంద, గొప్పిలి మీదుగా మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రం చెన్నై, ముంబాయి, కోల్‌కతా వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. పలాస జాతీయరహదారి, రైల్వేస్టేషన్ కేంద్రంగా రవాణా చేస్తున్నారు. గంజాయి రవాణాను పోలీసులు సీరియస్‌గా తీసుకొని విస్తృత దాడులు కొనసాగిస్తున్నారు. దీంతో నెల రోజులుగా పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు రైల్వేస్టేషన్లలో బ్యాగుల్లో తరలిస్తున్న గంజాయి నిల్వలు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో రైల్వే రక్షణ దళం పోలీసులు కూడా ఉండడం చర్చనీయాంశమవుతోంది.

● గిరిజన ప్రాంతాలు, మారుమూల కొండల్లో గంజాయిని ఎక్కువగా పండిస్తారు. అక్కడకు వెళ్లడానికి మన పోలీసులు, ఒడిసా పోలీసులు సైతం సాహసించలేకపోతున్నారు. ఆ ప్రాంతాలన్నీ మావోయిస్టు ప్రభావితంగా గుర్తింపు పొందాయి. దీంతో అక్కడివారి సహాయం లేనిదే వెళ్లడం వీలుకాదు. బంతిపూల సాగుమాటున గంజాయిని ఎక్కువగా పండిస్తారు. గంజాయి కూడా బంతిపూల చెట్లు మాదిరిగానే ఉండడంతో అవి పెద్దవయితేగాని ఏది బంతో, ఏది గంజాయో చెప్పడం కష్టం. ఇదే గంజాయి స్మగ్లర్ల పాలిట వరమైంది. ముఠా సభ్యులు గిరిజనులకు ఎకరాలకు రూ.లక్ష వరకు నగదు ఇచ్చి పంటనంతా సేకరించి ఎకరా పంట రూ.కోటి వరకూ అమ్ముకుంటారు. 20ఏళ్ల కిందట పలాస మండల గిరిజన ప్రాంతాల్లో కూడా గంజాయి సాగయ్యేది. అప్పటి ఎక్సైజ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా తరచూ దాడులు చేయడం, గిరిజనుల్లో అవగాహన కల్పించడంతో గంజాయిని పండించడం మానేశారు. వరి, రాగి, సజ్జలు పండించి.. జీవనోపాధి పొందుతున్నారు.

● ఒడిశా మారుమూల ప్రాంతాల్లో దాడులు, అవగాహన కార్యక్రమాలు లేకపోవడంతో బ్రోకర్ల మాటే గంజాయి వ్యాపారం సాగుతోంది. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా వాటి మూలాలు ఆర్.ఉదయగిరి, మోహన్‌బ్లాక్‌లతోనే ముడిపడి ఉండడం విశేషం. ఆంధ్రా, ఒడిశా పోలీసులు సంయుక్తంగా ఆయా బ్లాక్‌ల పరిధిలో గంజాయి పండించే రైతులకు అవగాహన కల్పించడం, నిరంతరం దాడులు చేస్తే గంజాయి రవాణా అరికట్టడం సాధ్యమవుతుందనేది నగ్నసత్యం.

గాయాలకు గురైన పోలీసులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది



చికిత్స పొందుతున్న ఎస్‌ఈబీ ఎస్ఐ



గంజాయి స్మగ్లర్ల బరితెగింపు!

● 'పలాస'లో పోలీసులపైకి కంటైనర్‌తో దూసుకెళ్లిన వైనం
● టాస్క్‌ఫోర్స్ ఎస్ఐతో సహా ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలు
● విశాఖపట్నం జిల్లాలో పట్టుబడిన వాహనం
● 380 కిలోల నిల్వలు లభ్యం ● డ్రైవర్, క్లీనర్ పరారీ

పలాస/ శ్రీకాకుళం క్రైం, మార్చి 3: గంజాయి స్మగ్లర్లు బరితెగించారు. గంజాయితో ఉన్న కంటైనర్ లారీ పలాస వైపు వెళ్తుందని శ్రీకాకుళం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఆదివారం వేకుమజామున 3 గంటల సమయంలో.. పలాస జాతీయరహదారి నెమలినారాయణపురం బైపాస్ రోడ్డు వద్ద అనుమానిత కంటైనర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆపే ప్రయత్నం చేయగా.. వాహనాన్ని వారిపైకి పోనిచ్చేలా దూసుకెళ్లారు. దీంతో ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. కంటైనర్ యూటర్న్ తీసుకొని మళ్లీ శ్రీకాకుళం వైపు వెళ్లిపోయింది. ఈ సమాచారం తెలుసుకుని.. విశాఖపట్నం పరదేశీపాలెం రోడ్డులో ఆ కంటైనర్‌ను ఆనందపురం పోలీసులు పట్టుకున్నారు. అందులో 380 కిలోల గంజాయి ప్యాకెట్లు లభించినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలివీ.

ఒడిశా రాష్ట్రం గారబంద వద్ద గంజాయిని కంటైనర్‌లో నింపి పలాస మీదుగా చెన్నై తరలిస్తున్నారని ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత నాతవలస, మడపాం, లక్ష్మీపురం టోల్‌గేట్లు వద్ద పహారా కాశారు. ఎస్ఐ గోరు ప్రభాకర్, కానిస్టేబుళ్లు బొడ్డేపల్లి సురేష్, బలగాన సంతోష్‌కుమార్ బృందం పలాస జాతీయరహదారి నెమలినారాయణపురం వద్ద మాటు కాసింది. ఆదివారం వేకువజామున 3గంటల ప్రాంతంలో అనుమానిస్తున్న కంటైనర్ లారీ (ఆర్‌జే32 జీసీ6433) రానే వచ్చింది. దానిని ఆపి తనిఖీ చేసేందుకు ఎస్ఐ ప్రభాకర్ తన ద్విచక్ర వాహనాన్ని కంటైనర్‌కు అడ్డంగా పెట్టారు. తాము పోలీసులమని వాహనాన్ని పక్కన పెట్టాలని ఆదేశించారు. దీంతో కంటైనర్‌లోని డ్రైవర్.. కొంతదూరం వాహనాన్ని వెనక్కి తీసి.. అతివేగంగా మళ్లీ ముందుకొచ్చి ఎస్ఐ, కానిస్టేబుల్ ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. తప్పించుకునేందుకు వారిని దాటుకుని కంటైనర్‌ను పోనిచ్చారు. దీంతో ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు గాయాలకు గురయ్యారు. అయినా కంటైనర్ ఆపకుండా కోసంగిపురం వద్ద యూ టర్న్ తీసుకొని తిరిగి శ్రీకాకుళం వైపు వెళ్లిపోయింది. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆ కంటైనర్‌ను పట్టుకోవడానికి జిల్లా పోలీసులు ప్రయత్నించారు. మడపాం టోల్‌గేట్ వద్ద కూడా కంటైనర్‌ను ఆపకపోవడంతో విశాఖ పోలీసులను సైతం అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా పరదేశీపాలేం వద్ద ఆనందపురం పోలీసులు ఆ కంటైనర్‌ను గుర్తించి పట్టుకున్నారు. అప్పటికే డ్రైవర్, క్లీనరు పరారీ అయ్యారు. కంటైనర్‌ను తనిఖీ చేయగా.. 380 కిలోల గంజాయి నిల్వలు లభ్యమయ్యాయని ఆనందపురం సీఐ తిరుపతిరావు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఘటనలో ఎస్ఐ ప్రభాకర్ కుడికాలుకి, కుడిచేతికి బలమైన గాయాలయ్యాయి. కానిస్టేబుళ్లు సంతోష్ కుడిచేతికి, సురేష్ ఎడమ కాలుకి గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ 108 వాహనంలో శ్రీకాకుళంలో జీజీహెచ్ (రిమ్స్)కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మెడీకవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ముగ్గురూ తలకు హెల్మెట్లు ధరించడం వలనే ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని వైద్యులు స్పష్టం చేశారు.క్షతగాత్రులను ఎస్పీ జీఆర్ రాధిక, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ పరామర్శించారు. అలాగే కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.



కంటైనర్‌లో తరలిస్తూ ఆనందపురంలో పోలీసులకు పట్టుబడిన గంజాయి బస్తాలు



ఇచ్ఛాపురంలో బ్యాగులతో పట్టుబడిన గంజాయి

కేరళ తరలిస్తూ.. ఇద్దరి అరెస్టు..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం, మార్చి 03: కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేశారు. వాటిని ప్రయాణికుల ముసుగులో కేరళ తరలించేందుకు సిద్ధమయ్యారు. ఇచ్ఛాపురం పోలీసులు వారిని అరెస్టు చేసి.. 15.60 కేజీల గంజాయి మూటలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఇచ్ఛాపురంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు తెలిపారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురం జిల్లాకు చెందిన కుట్టన్‌నాదర్ సత్యన్, శిబు దాసన్ ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేశారు. దానిని రైలు మార్గంలో కేరళ తరలించేందుకు ఇచ్ఛాపురం చేరుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని బంగ్లారోడ్డులో వారు గంజాయి మూటలతో ఉన్నట్టు సమాచారం అందింది. రూరల్ ఎస్సై లక్ష్మణ్‌తోపాటు టౌన్ సిబ్బంది కలిసి వారి వద్ద బ్యాగులు తనిఖీ చేశారు. రెండు బ్యాగుల్లో 15.60 కేజీల గంజాయి పట్టుబడింది. వారిద్దరినీ అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

రవాణాకు కేరాఫ్ సిక్కోలు

● జిల్లా మీదుగానే ఇతర ప్రాంతాలకు గంజాయి తరలింపు
● ఎన్నికల వేళ నిఘా పెరగడంతో పట్టుబడుతున్న సరుకు

(శ్రీకాకుళం క్రైం): గంజాయి రవాణాకు సిక్కోలు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. రాష్ట్రంలో ఏ మూలకు గంజాయి తరలించాలన్నా.. సిక్కోలు మీదుగా దాటించాల్సిందే. స్కూటీ నుంచి కంటైనర్ల దాకా.. ఇటు హైవేతోపాటు అటు రైల్వేమార్గాల ద్వారా రవాణా సాగుతోంది. చెక్‌పోస్టులు, పోలీసుల పటిష్ట భద్రత, నిఘా నేత్ర వలయాలను దాటుకుంటూ జాతీయ రహదారి మార్గం గుండా విశాఖకు గంజాయి నిల్వలు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి వివిధ మార్గాల్లో కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్ వంటి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సినిమాల్లో మాదిరి పాలవ్యాను మొదలుకొని అత్యవసర వాహనాల ద్వారా గంజాయి రవాణా చేస్తున్నారు.

● మూడేళ్లలో 50కు పైగా కేసులు..

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా తారాస్థాయికి చేరింది. ఒకప్పుడు విశాఖ జిల్లాలో అరకు, పాడేరు నుంచి మాత్రమే గంజాయి రవాణా అయ్యేది. ఇప్పుడు ఒడిశా రాష్ట్రం నుంచి ఏవోబీ సరిహద్దు ప్రాంతాలైన పర్లాఖిముడి, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, గొప్పిలి, మందస, కంచిలి, బరంపురం-ఇచ్ఛాపురం మీదుగా అధిక మొత్తంలో జిల్లాలోని జాతీయ రహదారి మీదుగా(ఇచ్ఛాపురం నుంచి పైడిభీమవరం వరకు) రవాణా సాగుతోంది. గంజాయి నియంత్రణలో భాగంగా పోలీసులు గడిచిన మూడేళ్లలో (2021-2023) 50కు పైగా కేసులు నమోదు చేశారు. గంజాయి రవాణాదారులను అదుపులోకి తీసుకుని.. భారీస్థాయిలో నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నెలరోజుల కిందట జిల్లాలో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి.. గస్తీ ముమ్మరం చేశారు. ఈక్రమంలో జిల్లాలో రోజూ ఏదో ఒక చోట గంజాయి నిల్వలు పట్టుబడుతూనే ఉన్నాయి.

● యువతే లక్ష్యంగా..

యువత, నిరుద్యోగులే లక్ష్యంగా గంజాయి సరఫరా సాగిస్తున్నారు. కొంతమంది యువత గంజాయి మత్తులో దొంగతనాలు, దాడులతోపాటు హత్యలకు కూడా వెనుకాడడం లేదు. చీకటి పడిందంటే యువకులంతా గుంపులుగా జిల్లాలోని రహస్య ప్రాంతాలకు చేరుకుని గంజాయి సేవిస్తున్నారు. అర్ధరాత్రి గంజాయి మత్తులో రోడ్లపై పడి అడ్డొచ్చిన వారిని చితగ్గొట్టడం, డబ్బులు లాక్కోవడం చేస్తున్నారు. 2022 ఏప్రిల్‌లో శ్రీకాకుళం సబ్‌డివిజనల్ కార్యాలయం వెనుక గూనపాలెంలో పట్టపగలు కరణ్ రాజ్ అనే యువకుడిని ఆరుగురు యువకులు గంజాయి మత్తులో గొడ్డలి వేటుతో హతమార్చారు. ఈ ఘటనను ఇప్పటికీ సిక్కోలు వాసులు మరిచిపోలేరు. గత ఎస్పీ అమిత్‌బర్దర్ హయాంలో వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో 20మందికిపైగా గంజాయి మత్తుకు బానిసైన యువకులను పిలిచి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆరోగ్యమిత్రల జాడేదీ?

● పీహెచ్‌సీల్లో కానరాని సిబ్బంది
● ఆరోగ్యశ్రీ సేవలకు దూరమవుతున్న గ్రామీణ ప్రజలు

(వజ్రపుకొత్తూరు)

పీహెచ్‌సీల్లో ఆరోగ్యమిత్రల జాడ కనిపించడం లేదు. ఫలితంగా తాము ఆరోగ్యశ్రీ సేవలకు దూరమవుతున్నామని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీల్లోనే ఆరోగ్యమిత్రలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామీణులకు ఆరోగ్యశ్రీ సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి పీహెచ్‌సీలో ఒక్కో ఆరోగ్యమిత్రను నియమించారు. వారు పీహెచ్‌సీ గ్రామాల్లో పర్యటించి.. ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పించాలి. అవసరమైన వారికి ఆస్పత్రిలో చేర్పించి ఉచిత సేవలు అందించాలి. కాగా కరోనా వ్యాప్తి తర్వాత పీహెచ్‌సీలోని ఆరోగ్యమిత్రలను సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రికి బదలాయించారు. అప్పటి నుంచీ గ్రామీణ ప్రాంత ప్రజలకు పీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు వజ్రపుకొత్తూరులో నాలుగు పీహెచ్‌సీలు ఉండగా.. ఆరోగ్యశ్రీ సేవల కోసం పలాస సీహెచ్‌సీకి వెళ్లాలని సిబ్బంది చెబుతున్నారు. కాగా, సీహెచ్‌సీలో ఎవరిని కలవాలో.. ఎలా సేవలు పొందాలో తెలియడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు.

● ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన లేక కొంతమంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి.. ఆర్థికంగా నష్టపోతున్నారని.. వజ్రపుకొత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు, చినవంక మాజీ సర్పంచ్ సాన కృష్ణ, తదితరులు పేర్కొంటున్నారు. పీహెచ్‌సీలకు దూరంగా ఉన్న గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో ఆరోగ్యమిత్రలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అక్కుపల్లి పీహెచ్‌సీ కేంద్రం

సేవలు అందిస్తున్నాం



ఆరోగ్యమిత్రలను ప్రస్తుతం సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు నియమించారు. పీహెచ్‌సీలను సంప్రదిస్తున్నవారికి ఆరోగ్యశ్రీ సేవల కోసం ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నాం. వైద్యసేవలు అందిస్తున్నాం. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందిని సంప్రదించినా ఆరోగ్యశ్రీ సేవల గురించి సమాచారం తెలుస్తుంది.

- డాక్టర్ కనిస్కా, పీహెచ్‌సీ వైద్యుడు, వజ్రపుకొత్తూరు

పోలియో చుక్కలతో చిన్నారులకు భవిత

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

అరసవల్లి, మార్చి 3: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి.. వారి బంగారు భవితకు బాటలు వేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలోని సంతోషిమాత కోవెల జంక్షన్ వద్ద ఆయన తన సతీమణి, కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాతో కలిసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. 'చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. పిల్లలు పోలియో బారిన పడితే ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. అందుకే అందరూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల'ని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఈశ్వరీదేవి, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, స్వచ్ఛంద సేవకుడు మంత్రి వెంకటస్వామి, మోహిని, లక్ష్మీ, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కల్యాణం.. కమనీయం

● ఘనంగా వాసుదేవుని బ్రహ్మోత్సవాలు
● మార్మోగిన హరి నామస్మరణ

మందస, మార్చి 3: మందసలో వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఆదివారం స్వామి కల్యాణం కన్నులపండువగా సాగింది. ఆలయ ప్రాంగణం హరి నామస్మరణతో మార్మోగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కల్యాణాన్ని అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయం నుంచి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి భూదేవి, వాసుదేవుని ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంపై వేంచేసి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. అనంతరం స్వామి కల్యాణాన్ని నిర్వహించగా వందలాది మంది భక్తులు తిలకించి పునీతులయ్యారు. విష్ణుసేవ సుదర్శన యాగం నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేశారు. దేవుని కృపతో ఈ ప్రాంతమంతా సుఖసంతోషాలు, పాడిపంటలతో కళకళలాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని కోరారు. మంత్రి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తదితరులు వాసుదేవుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కూర్మాచార్యులు శిరీషకు శేష వస్త్రాలను అందించారు. మందస, పలాస పట్టణాలకు చెందిన పలువురు మహిళలు కోలాట ప్రదర్శన చేపట్టారు.

నేటి కార్యక్రమాలు


సోమవారం ఉదయం పొన్నచెట్టు వాహనం, తెప్పోత్సవం, అశ్వవాహన సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే బెందాళం దుర్గాప్రసాద్ బృందం సంగీత విభావరి, శ్రీసాయిమోహన్ నృత్య కళానికేతన్ కళాకారుల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.





వాసుదేవుని కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

దడ పుట్టిస్తున్న డీజే



● శుభకార్యాల్లో పరిమితికి మించి ధ్వని
● అవస్థలు పడుతున్న ప్రజలు

(ఇచ్ఛాపురం)

శుభకార్యాల్లో ఇటీవల ఎక్కడ చూసినా డీజేలతో అధిక ధ్వని పుట్టిస్తున్నారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, రజస్వల వేడుకలు.. ఇలా ఏ కార్యక్రమమైనా డీజేలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో పండుగలు, శుభకార్యాల్లో చిన్న మైక్‌సెట్లు వినియోగించేవారు. వీటివల్ల ఎవరికీ పెద్దగా ధ్వనుల ఇబ్బందులు ఉండేవి కాదు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం మరింత పెరగడంతో.. చాలామంది స్టేటస్ సింబల్‌గా డీజేలు ఏర్పాటు చేస్తున్నారు. ఊరేగింపుల సమయంలో మరింత అధిక ధ్వనుల కారణంగా చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధిక ధ్వనులతో భూ ప్రకంపనంలో కూడా మార్పులు సంభవించే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. మానవుడు 20హెడ్జ్‌ల నుంచి 20వేల హెడ్జ్‌లు ధ్వనులు వినవచ్చును. దీన్ని శ్రవ్య అవధి అంటారు. ఇవి ఎలాంటి హానీ తలపెట్టవు. అంతకు మించి ధ్వనిని వింటే మానవులకు అనేక రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. అధిక ధ్వని వినటం వలన గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస, జీర్ణకోశం సంబంధిత వ్యాధులు సంభవిస్తాయి. మానసికంగా కూడా ఒత్తిడికి గురవుతారు. అలసట, నీరసం, మూర్ఛ తదితర వాటికి లోనవుతారు. రక్త ప్రసరణలో హెచ్చుతగ్గులు వస్తాయి. దీంతో రక్తపోటుకు గురై పక్షవాతం, లేక గుండె సంబంధిత వ్యాధులకు గురువతారని వైద్యులు చెబుతున్నారు. 20వేల హెడ్జ్‌ల కన్నా ఎక్కువ ధ్వని కేవలం జంతువులు మాత్రమే వినగలవని పేర్కొంటున్నారు. అధిక ధ్వనుల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు స్పందించి తక్కువ ధ్వనికి సంబంధించిన డీజే పరికరాలు మాత్రమే వినియోగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

డీజే సౌండ్‌తో అనారోగ్యమే..

డీజే సౌండ్‌తో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. గుండెజబ్బులు ఉత్పన్నమవుతాయి. రక్తపోటు, గుండె చప్పుడు పెరిగిపోవటం, గుండె 70-100 సార్లు కొట్టుకుంటుంది. అలాంటప్పుడు గుండె ఆగిపోయే ప్రమాదం ఉంది. రక్తపోటు పెరిగి నరాలు దెబ్బతింటాయి. అధిక ధ్వనులు వింటే మతిస్థిమితం కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.

-దేవేంద్రరెడ్డి, సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం సీహెచ్‌సీ

చుక్కల మందుకు చుక్కని స్పందన


గార: శ్రీకూర్మంలో డీఐవో ఈశ్వరీదేవి..


ఇచ్ఛాపురం: పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

● విజయవంతంగా పల్స్ పోలియో

జిల్లావ్యాప్తంగా ఆదివారం చేపట్టిన పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా సాగింది. అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 0-5 మధ్య వయసు గల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


సోంపేట: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం


హిరమండలం: సుబలయి ఆర్అర్ కాలనీలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు


బూర్జ: పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం


సరుబుజ్జిలి ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద..


ఎల్ఎన్ పేట: బొర్రంపేటలో..


జి.సిగడాం: పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు


జలుమూరు: కొమనాపల్లిలో నమోదు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

వన్యప్రాణులను సంరక్షించుదాం

ఇచ్ఛాపురం: వన్యప్రాణులను ప్రతిఒక్కరూ సంరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు కె.సుహాష్‌చంద్ కోరారు. ఆదివారం ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు జంతువుల మాస్కులు ధరింపజేసి అవగాహన కల్పించారు.

టెట్‌కు 316 మంది హాజరు

ఎచ్చెర్ల: మండలంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)కు 316 మంది హాజరయ్యారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్టుల్లో కలిపి 200కు 188 మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 140కు 128 మంది హాజరయ్యారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరగనున్నాయి.

గృహాలు ప్రారంభం

పొందూరు: పొందూరు, నందివాడ, తోలాపి, ధర్మపురం తదితర గ్రామాల్లో జగనన్న కాలనీలో గృహాలను ఆదివారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎల్. కాంతారావు, పి.రమేష్, కె.రమణమూర్తి హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘ సమావేశం

ఇచ్ఛాపురం: లొద్దపుట్టిలో మహిళా సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో విడత ఆసరా రుణమాఫీ డబ్బులను నామినిగా ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.11,500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిరియా విజయ పాల్గొన్నారు.

నేతాలమ్మ.. చల్లగా చూడమ్మా

జిసిగడాం: చల్లగా చూడమ్మా అంటూ నేతాలమ్మ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. వాండ్రంగిలో వెలసి ఉన్న నేతాలమ్మ అమ్మవారి యాత్ర మహోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలుత గ్రామ శివారులో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నేతాలమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మంగలవాయిద్యాల నడుమ తిరువీధిని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ముగ్గురాటలతో శుద్ధి చేశారు. కోర్కెలు తీర్చే కల్పవల్లి నేతాలమ్మను గ్రామ, పరిసర గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అలంకరణలో అమ్మవారు

తిరిగి పలకరింపే.. వారి తప్పయింది

● తిట్టారంటూ చితకబాదిన యువకులు

● ముగ్గురికి తీవ్ర గాయాలు

శ్రీకాకుళం క్రైం: కొందరు యువకులు అమ్మవారి జాతరలో ఇద్దరు వ్యక్తులను పలకరించారు. దీంతో వారు కూడా తిరిగి పలకరించారు. అయితే, వారు తమను తిట్టారంటూ యువకులు ఆ వ్యక్తులపై దాడికిపాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఔట్ పోస్టు పోలీసులకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కిమ్స్ ఆసుపత్రి సమీపంలో టెంట్లు వేసుకుని జీవిస్తున్న సంచార జాతులకు చెందిన పెదాల నాగరాజు, అతని బావ మంజు ఈ నెల 1వ తేదీ రాత్రి కింతలి కనిమెట్ట గ్రామంలో జరిగిన అమ్మవారి సంబరాలను వీక్షించేందుకు తమ ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా దీపావళి సామగ్రి అమ్మే చోటకు వచ్చేసరికి మరో వాహనంపై ముగ్గురు వ్యక్తులు వీరి వెనుకగా వస్తూ.. హాయ్ బ్రో అంటూ పలకరించారు. ఈ క్రమంలో నాగరాజు, మంజు తిరిగి వారిని హాయ్ బ్రో అంటూ బదులు పలకరించారు. కొద్ది దూరం వెళ్లేసరికి తొలుత పలుకరించిన ఆ ముగ్గురు యువకులు నాగరాజు, మంజును అడ్డగించి.. ఏమని తిట్టారంటూ వారిపై దాడిచేశారు. మంజు వారి నుంచి తప్పించుకుని పారిపోగా, నాగరాజు వారికి దొరికిపోయాడు. దీంతో ఆ ముగ్గురితో పాటు వారి స్నేహితులు మరో ముగ్గురు అక్కడికి చేరుకుని నాగరాజును చితకబాదారు. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు సోదరులు శ్రీను, దావీదులు అక్కడికి చేరుకుని దాడిని అడ్డుకున్నారు. అక్కడి నుంచి తప్పించుకుని తాము ఉంటున్న ప్రాంతానికి వచ్చేశారు. దాడికి పాల్పడిన వారందరూ ఆ ప్రాంతానికి చేరుకుని ఇంట్లో ఉన్న నాగరాజు, అతని సోదరులపై దాడికి పాల్పడ్డారు. ఈలోగా నైట్‌బీట్ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. దాడిలో నాగరాజు, అతని సోదరులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం రిమ్స్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా.. గస్తీలో ఉన్న పోలీసులు ఉదయం వెళ్లి చికిత్స చేయించుకోవాలని, ఇప్పుడు వెళ్తే వారు మళ్లీ దాడి చేసే ప్రమాదం ఉందని వారించారు. దీంతో శనివారం వారు రిమ్స్‌కు వెళ్లి చికిత్స చేయించుకుని ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇదిలా ఉండగా నాగరాజు, అతని సోదరులు కర్రలతో కొట్టడంతో పైడి వంశీ గాయపడ్డాడు. దీంతో అదే రోజు రాత్రి వంశీ రిమ్స్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఈక్రమంలో ఔట్ పోస్టు పోలీసులు ఏం జరిగిందని ప్రశ్నించడంతో తన స్నేహితులు అన్నెపు భరత్, పైడి రోహిత్‌తో కలిసి కింతలి గ్రామంలో పండగ చూసుకుని వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బండి ఆపి డబ్బులు డిమాండ్ చేశారని, సెల్‌ఫోన్లు లాగేసుకునేందుకు ప్రయత్నించారని వివరించారు. దీనిని తాము ప్రతిఘటించగా వారు కర్రలు, కత్తులతో దాడికి పాల్పడ్డారన్నారు. వారిలో ఒక వ్యక్తి పారిపోయాడని, మరో వ్యక్తి పట్టుకున్నట్టు చెప్పారు. అతని బంధువులు, మహిళలు అంతా దాడికి వచ్చారన్నారు. ఈ క్రమంలో గాయాలయ్యాయని, వెంటనే అంబులెన్సులో చికిత్స కోసం తన స్నేహితులతో కలిసి రిమ్స్‌కు వచ్చినట్టు వంశీ చెప్పారు. ఇంతవరకు బాగానే ఉన్నా తనపై దాడి చేశారని చెప్పుకొచ్చిన వంశీ.. డిశ్చార్జి తీసుకోకుండానే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవడం విశేషం.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారి


స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం అర్బన్ రీసర్వే స్పెషల్ అధికారి బి.సుబ్బారావు (ఐఏఎస్) కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వీరిక ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కాగా ఆదిత్యుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.11,35,167 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.6,50,6000, విరాళాల ద్వారా రూ.1,59,000, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.3,25,000 ఆదాయం లభించిందని ఆలయ ఈవో రమేష్‌బాబు తెలిపారు.

కూర్మనాథుని సన్నిధిలో సీఈ


స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న ఈవో

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఆదివారం జలవనరులు శాఖ చీఫ్ ఇంజనీర్ బాలసత్య సాయి శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి ప్రసాదాన్ని ఆలయ ఈవో గురనాథరావు వారికి అందచేశారు. వీరి వెంట ఎస్ఈ డోలా తిరుమలరావు ఉన్నారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో నెల నెలవారీ సాహితీ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెరవే కవులు గుడిమెట్ల గోపాలకృష్ణ, పీవీ దుర్గా ప్రసాద్, నిక్కు అప్పన్న, యు.నాగేశ్వరరావు, డాక్టర్ కోమలరావు, ఐఎన్‌డీ ప్రసాద్, ఇద్ది పాపయ్య, బి.జగన్నాథం తదితరులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు.

టీడీపీలో 60 కుటుంబాలు చేరిక


టీడీపీలో చేరిన వారితో కూన రవికుమార్

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీలో గల డాబాల వారి వీధికి చెందిన వైసీపీ నాయకులు నక్క గోపాలరావు, ఎరిపిల్లి గోపి ఆధ్వర్యంలో 60 యాదవ కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే మెట్టక్కివలస ప్రాంతానికి చెందిన వైసీపీ యువ నాయకుడు అన్నెపు కృష్ణకాంత్ ఆధ్వర్యంలో 60 మంది యువకులు టీడీపీలో చేరారు. వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి కూన రవికుమార్ ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు, నాగల మురళీధర్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల నుంచి కళింగ కోమట్లకు చెందిన 200 కుటుంబాలు స్థానిక విశాఖ ఏ కాలనీలో గల తన కార్యాలయంలో చేరుకుని తమ మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో అంధవరపు శ్రీనివాసరావు, రెడ్డి శంకర్, రెడ్డి సూర్యనారాయణ, అంబటి లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దంపతులు

కలెక్టరేట్: స్థానిక పాత బస్టాండ్ వద్ద గల రెడ్‌క్రాస్ మెడిసిన్ బ్యాంకు ప్రాంగణంలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. ముందుగా రెడ్‌క్రాస్ ఫౌండర్ హెన్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెగా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని ప్రముఖ వైద్యుల సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ సోమవారం నుంచి శనివారం వరకు అందిస్తున్నన ఉచిత వైద్య సేవలను వినియోగించుకుని అందరూ ఆరోగ్యవంతులు కావాలన్నారు. అనంతరం వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు పీఎల్ఎన్ రాజు, ధర్మాన లక్ష్మీనారాయణ, దినేష్‌కాంత్, ప్రేమ్ సక్సెరి, ఎస్.చంద్రశేఖర్, పి.రామకృష్ణ, కె.లక్ష్మణమూర్తి, కిరణ్‌కాంత్, బి.అరుణ్‌కుమార్ గుప్తా, డీకే చిన్నబాబు, డీపీ సునీల్ కుమార్, ఎస్.వెంకట రాజేష్, కె.ప్రసన్నలక్ష్మి, జె.నికితలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, డీపీఆర్వో బాలమాన్‌సింగ్, కె.కల్యాణ్, పెంకి చైతన్య, బి.సతీష్‌కుమార్, సుజాత, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నీరజకు అభినయ ముగ్ధశ్రీ పురస్కారం


బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నృత్యకారిణి నీరజకు అభినయ ముగ్ధశ్రీ పురస్కారం లభించింది. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శ్రీలలితా కళానృత్య నికేతన్ వారిచే ఈ నెల 2, 3 తేదీల్లో భారతీయ నృత్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన అభినయ నృత్యనికేతన్ నృత్య దర్శకురాలు నీరజా సుబ్రహ్మణ్యానికి ఈ పురస్కారంతో సత్కరించారు. అనంతరం నీరజ శిష్య బృందంచే పలు కూచిపూడి నృత్యాలు ప్రదర్శనలు చేశారు. అనంతరం సంస్థ అధ్యక్షులు అరవ అనిల్ కుమార్ చేతులు మీదుగా శిష్యులను నటరాజనంది అవార్డులతో సత్కరించారు.

ఆదిత్యాలయంలో సూర్య నమస్కారాలు



అరసవల్లి: సూర్య ప్రణవ పతంజలి యోగ విద్యా సంఘం అధ్యక్షురాలు తంగి స్వాతి ఆధ్వర్యంలో 108 మంది అభ్యాసకులతో ఆదిత్యాలయంలో సూర్య నమస్కారాలు సాధన చేయించారు. సూర్య నమస్కారాలను సాధనం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు.

ధనరాజ తులసమ్మ సంబరం


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీలోని 21వ వార్డు గొల్ల వీధికి చెందిన నీలాద్రి కుటుంబ సభ్యులు ఆదివారం ధనరాజ తులసమ్మ సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను కాళికాదేవి, కొయినాటకం డ్యాన్సులతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. బిందెలతో తీసుకువెళ్లిన పసుపునీరు, పానకాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత సింగుపురం


విజేత జట్టుకు ట్రోపీ అందిస్తున్న దృశ్యం

పొందూరు: కింతలి సీతారామ మహా కల్యాణం జాతర పురస్కరించుకుని మూడు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. పాలకొండ, సింగుపురం జట్ల మధ్య రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో సింగుపురం విజేతగా నిలిచింది.

శ్రీశైల మల్లన్న తలపాగా సిద్ధం


తలపాగాను సిద్ధంచేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: శ్రీనివాసచార్యులపేట పంచాయతీ వేణంపేట దేవాంగుల వీధికి చెందిన చేనేత కార్మికులు శ్రీశైల మల్లన్న తలపాగా సిద్ధంచేశారు. రాష్ట్రంలోని శ్రీశైలంలో వెలిసిన మల్లిఖార్జున స్వామి మహాశివరాత్రి ఉత్సవాలకోసం తలపాగాను 20రోజులుగా తయారుచేశారు. ప్రభుత్వ అనుమతితో గ్రామానికి చెందిన 14 మంది చేనేత కార్మికులు శ్రీశైల మల్లికార్జున స్వామికి భక్తి శ్రద్ధలతో తలపాగా తయారుచేసి శివరాత్రి పర్వదినాన శ్రీశైల శిఖరానికి చుడ తారు. ఫిబ్రవరి 13న చేనేత ప్రారంభించిన ఈ తలపాగా పొడవు 365 మూరలు (182 మీటర్లు) ఉంటుందని కార్మికులు తెలిపారు. ఆరు సంవత్సరాలు నుంచి శ్రీశైల మల్లన్నకు ధరించే ఈ తలపాగా తయారుచేస్తున్నామని, తలపాగాకు ప్రత్యేక పూజలు నిర్వహిచి ఊరేగింపు అనంతరం శ్రీశైలం తీసుకెళ్లనున్నట్టు చేనేత కార్మికులు తెలిపారు.

వత్సవలసలో రాజమ్మకు పూజలు


జాతరలో పాల్గొన్న భక్తులు

గార: వత్సవలసలో రాజరాజేశ్వరి (రాజమ్మ) అమ్మవారి యాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు రాజమ్మను దర్శించి ముడుపులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రికే గ్రామానికి చేరుకుకున్న భక్తులు ఆదివారం ఉదయం సముద్రస్నానాలు చేసి రాజమ్మను దర్శించి భక్తితో పూజలు నిర్వహించారు. సీఐ ఎల్ఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.కృష్ణమూర్తి బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైసీపీ విధ్వంసకర విధానాలను ప్రతిఘటిద్దాం


బీసీల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేస్తున్న దృశ్యం

అరసవల్లి: దోపిడీ, దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేసిన వైసీపీ విధ్వంసకర విధానాలను ప్రతిఘటిద్దామని మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా ఆర్జించిన దోపిడీ సొమ్ముతో మళ్లీ రానున్న ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వద్దామని చూస్తున్న జగన్‌రెడ్డికి బీసీలందరూ ఏకమై బుద్ధి చెబుదామన్నారు. ఈ నెల 5వ తేదీన మంగళగిరిలో నిర్వహించనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి రమణ, తెలుకల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మనాపల్లి వెంకటరామరాజు, జంగమ సాధికార సమితి సభ్యుడు విభూది సూరిబాబు, బీసీ సోషల్ మీడియా కన్వీనర్ బుక్కా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువను తెలియజేయాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొందూరు: ఓటు విలువను తెలియజేయాల్సిన బాధ్యత యువతపై ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము తెలిపారు. ఆదివారం పొందూరులో నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత బలమైనదని, ఓటే వజ్రాయుధమని తెలిపారు. పార్టీ నాయకులు వండాన మురళి, బలగ శంకర భాస్కర్, కాలెపు శ్రీనివాసరావు, బాడాన శ్రీహరి పాల్గొన్నారు.

జగన్ పాలనలో విశ్వ బ్రాహ్మణులకు అన్యాయం


మాట్లాడుతున్న రామస్వామి

లావేరు: పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో విశ్వబ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేపూరి రామస్వామి అన్నారు. ఆదివారం వెంకటాపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పిస్తామని, ప్రత్యేక పథకాలు అందించి విశ్వబ్రాహ్మణులను ఆదుకుంటామని చెప్పిన ఎన్నికల్లో గెలిచిన తర్వాత పక్కన పెట్టేశారన్నారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.70 కోట్లు నిధులను కేటాయించి కొంత మేర ఆదుకోవడం జరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకం విశ్వబ్రాహ్మణులకు ఏ మాత్రం ఉపయోగంగా లేదన్నారు. వృత్తులు చేయని 18 కులాలను చేర్చి ఈ పథకాన్ని అమలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రాయల రాము, విజయనగరం పార్లమెంటరీ టీడీపీ కార్యదర్శి లంక నారా యణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, సర్పంచ్ బొంతు ఎల్లన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు



సరుబుజ్జిలి: మునగవలస జంక్షన్ వద్ద ఉన్న మలు ప్రమాదలకు పిలుపుగా మారింది. ఆలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో ఉన్న ఈ మలుపు వద్ద గతంలో పలు రోడ్లు ప్రమాదాలు జరిగి కొంతమంది మృత్యువాత పడగా మరికొందరు గాయపడ్డారు. ఈ రహదారిలో ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగి స్తుంటాయి. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సైనికుల్లా పనిచేయాలి

ఆమదాలవలస: రాష్ట్రంలో అస్తవ్యస్త పాలనతో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వ పతనానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మునిసిపాలిటీకి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన కన్వీనర్లను సేవకులుగా గుర్తించి ఏజెంట్లకు ప్రశంసాపత్రాలు అందించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు ఏ ఒక్కరూ కూడా నిర్లక్ష్యం చేయకుండా భవిష్యత్తును ఆలోచిస్తూ ఓటర్లను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ నాయకులు ఆనెపు రామకృష్ణనాయుడు, నూకరాజు, బోర గోవిందరావు, శివ్వాల సూర్యనారాయణ, తమ్మినేని విద్యాసాగర్, బలగ విజయశంకర్, భాస్కర్, వండాన మురళి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సోంపేట: పట్టణంలో పలు అభివృద్ధిపనులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతి పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో విద్యార్థులు ముందుకెళ్లాలి

ఆమదాలవలస: పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎస్ఐ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మెట్టక్కివలస ప్రాంతంలో ఉన్న వసతి గృహాలతో పాటు స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న వసతిగృహంలో చిన్నారికి చేదోడు కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సంజీవరావు, కేపీ రాజారావు పాల్గొన్నారు.

దగాకోరు వైసీపీని సాగనంపండి: కళా

ఎచ్చెర్ల: అన్ని రంగాల్లో విఫలమైన దగాకోరు వైసీపీని రానున్న ఎన్నికల్లో సాగనం పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. తమ్మినాయుడుపేటలో ఆదివారం బాబుతో నేను యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి, సూపర్ సిక్స్‌పై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీలో పని చేసిన చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆ పార్టీలో వేగలేక టీడీపీలో చేరుతున్నారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు వావి లపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు, సనపల హరి, పైడి అన్నంనాయుడు, గొలివి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: తమ్మినాయుడుపేటలో 'బాబు ష్యూరిటీ' నిర్వహిస్తున్న కిమిడి కళావెంకటరావు తదితరులు

రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమే: కలమట

కొత్తూరు: రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి అన్నారు. మాతలలోని కార్యాలయంలో పలువురు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ.. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు టీడీపీలో చేరారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే సీఎంగా చంద్రబాబు మళ్లీ రావాలన్నారు. టీడీపీలో చేరిన వారిలో కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీ చిన్నరాజపురానికి చెందిన వార్డు మెంబర్లు సవర దుర్గారావు, సవర చిరంజీవితో పాటు సవర అప్పారావు, ముఖలింగం, శంకర్, రాజయ్య, శ్రీను, చందు, కురమయ్య, నగేష్, సవర మోజేష్‌తో పాటు మరో 15 కుటుంబాల వారున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాతుకొండ మోహన్‌రావు, సవర సురేష్, పాల్గొన్నారు.


పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కలమట వెంకట రమణ

'సూపర్ సిక్స్'తో ప్రజలకు మేలు

నరసన్నపేట: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ మేలు చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని 11వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేని ఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయదుందుభి మ్రోగించడం ఖాయమన్నారు. వైసీపీ నాయకుల అక్రమాలకు అడ్డుకట్టు వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నేతలు గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయన సతీష్, బెవర రాము, ఉణ్న వెంకటేశ్వరరావు, నేతింటి విశ్వేశ్వరరావు బెవర శివ, రమేష్, తాళాభక్తుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. ఆదివారం బద్రి, బుడితి, మహిసింగి గ్రామాల్లో వారు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. వైసీపీ ప్రభుత్వం అనుసరి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్ర మాల్లో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సారవకోట రామారావు, నాయకులు ముద్ద భీమారావు, డి.జయరాం, చల్ల ఆనందరావు, పి.రత్నాలనాయుడు, ఇ.హేమ సుందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **జి.సిగడాం:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వర రావు అన్నారు. ఆదివారం మద్రివలస, పెంట, డీఆర్‌వలస, నిద్దాం, టీడీవలస, మెట్టవలస, దవళపేట, ఆనందపురం, గొబ్బూరు, బాతువ, మదుపాం తదితర గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కూనుబిల్లి కూర్మారావు, పైల రామకృష్ణ, సర్పంచ్‌లు మహదాశ్యం చిన్నారావు, బోగాది అప్పలనాయుడులు, విక్రం కాశీబాబు, కంచరాన సూరన్నాయుడు, విక్రం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట: సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బగ్గు రమణమూర్తి తదితరులు


మహిసింగిలో టీడీపీ పథకాలను వివరిస్తున్న తిరుపతిరావు


బుడితిలో భవిష్యత్‌కు గ్యారెంటీలో పాల్గొన్న కత్తిరి వెంకటరమణ


జి.సిగడాం: పెంటలో అవగాహన కల్పిస్తున్న పార్టీ నాయకులు

మృతుల కుటుంబాలకు శివాజీ పరామర్శ


ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గౌతు శివాజీ

హరిపురం: మందస మండలంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి గౌతు శివాజీ ఆదివారం పరామర్శించారు. వీవీఆర్ పురం, ముకుందపురం, సొండిపూడి, బాలాజీపురం, డిమిరియా, భైరిసారంగపురం, మందస గ్రామాల్లో మృతి చెందిన టీడీపీ కార్యక ర్తలు కర్రి ఆనందరావు, తలగాన దాలమ్మ, మామిడి పాపారావు, ముంజేటి అప్పన్న తదితరుల కుటుంబ సభ్యలను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబాలకు టీడీపీ అండగా నిలుస్తుందని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, దాసరి తాతారావు, రుద్రయ్య నవీన్, కోనారి తులసీరావు, రట్టి లింగరాజు, రాజాన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకూ పోరాటం


ఎమ్మెల్సీ రఘువర్మకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: సీపీఎస్ రద్దు చేసే వరకూ పోరాటం సాగించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ అన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పాలకులు రాజకీయాలతో ముడి పెట్టి ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సీపీఎస్ రద్దుతో పాడు పీఆర్సీ, డీఏ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు అందరూ ఏకతాటిపై నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, డి.సరస్వతి, జిల్లా అధ్యక్షుడు మదన్, అనిల్, కామేశ్వరరావు, జె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళ పాత్ర అత్యుత్తమమైనది

టెక్కలి: సమాజంలో మహిళ పాత్ర అత్యుత్తమమైనదని టెక్కలికి చెందిన న్యాయవాది చంద్రశేఖర్ పట్నాయక్ అన్నారు. ఆదివారం రావివలస పంచాయతీ చిన్ననారాయపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయన మహిళా హక్కులు, చట్టాలు, విధులు, బాధ్యతలపై వివరించారు. కార్యక్రమంలో పీవో కె.గొల్ల, విద్యార్థులూపాల్గొన్నారు.

అమ్మవార్లకు చల్లదనం

నందిగాం: నందిగాం గ్రామదేవత పాతపట్నం అమ్మవారి ఆలయ ప్రారంభం, విగ్రహ పునఃప్రతిష్ఠను పురస్కరించుకొని ఆదివారం గ్రామస్థులు గ్రామదేవతలకు చల్లదనం చేశారు. పాతపట్నం అమ్మతల్లితో పాటు సండెమ్మతల్లి, చింత పోలమ్మ, సామాలమ్మ, భూలోకమ్మ అమ్మవార్లకు మహిళలు ముర్రాటలు పోశారు. అమ్మవార్లకు చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నందిగాం: నరేంద్రపురం పంచాయతీ పెద్దబాణాపురం, పాతినివానిపేట గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు వైసీపీ జిల్లా సమన్వయకర్త పేరాడ తిలక్, ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, ఎస్సీ శ్మశాన వాటికకు రహదారి తదితర పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నేతలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

కొత్తూరు: మండలంలోని రాయల గ్రామంలో డి.మన్మథరావు కిడ్నీ, పాంక్రియాసిస్, సుగర్‌తో బాధపడు తూ మంచానికే పరిమితమయ్యాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని శ్రీభగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు స్పందించారు. ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి రూ.15 వేలతో పాటు నిత్యా వసర సరుకులను అందించారు. కార్యక్రమంలో పలువురు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అధికారం కోసం మతం దుర్వినియోగం

పలాసరూరల్: ప్రస్తుత పాలకులు అధికారం కోసం మతాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బొడ్డపాడు గ్రామంలోని అమరవీరుల స్మారక మందిరంలో ఆదివారం 'మతం-రాజ్యాంగంలో పౌరుల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేసు మాట్లాడుతూ.. దేశంలో కులవ్యవస్థ ఏర్పడడానికి మతం దోహదం చేసిందని, నిజంగా మతం మానవజాతికి అవసరమా అని ప్రశ్నించారు. సంఘం జిల్లా కార్యదర్శి పిండి వెంకట్రావు మాట్లాడుతూ.. మతాన్ని సొంత ప్రయోజనాల కోసం ఎలా దుర్వినియోగం చేస్తున్నారో వివరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు సాలిన వీరాస్వామి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో పారిశుధ్య పనులు

జలుమూరు: శ్రీముఖలింగంలో మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్ల పక్క ఉన్న చెత్తను తొలగించడంతో పాటు కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు సర్పంచ్ టి.సతీష్ తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యం కోసం స్నానాల ఘట్టాల రేవులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చీడివలసలో కార్డెన్ సెర్చ్

పోలాకి: చీడివలస గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలాకి, నరసన్నపేట, జలుమూరు సారవకోట మండలాల పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. నరసన్నపేట సీఐ ఆనందబాబు, పోలాకి ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ తనిఖీ చేపట్టారు. గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సుమారు 20 మంది పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్డెన్ సెర్చ్ సందర్భంగా ధ్రువపత్రాలు లేని ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

భక్తిభావం మరింత పెంపొందాలి

దీర్ఘాశిదుర్గాకాలనీ(పోలాకి): ప్రజల్లో భక్తిభావం మరింత పెంపొందాలని వేద పండితుడు ఆరవల్లి కృష్ణశర్మ అన్నారు. ఆదివారం దుర్గాకాలనీలో స్థానిక యువజన నాయకుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన నెలకొంతోందన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

జీడి పంట దగ్ధం

వజ్రపుకొత్తూరు: బాతుపురం-రాజాం పరిసర తోటల్లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు మూడు ఎకరాల జీడిపంట దగ్ధమైంది. బాతుపురానికి చెందిన జీడి రైతులు ఆకులు మంట పెట్టే సమయంలో మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో జీడి పూత, లేత పిక్కలు కాలిపోవడంతో ఏడుగురు రైతులు నష్టపోయారు. బాధితులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం

వజ్రపుకొత్తూరు నుంచి రాజాం కాలనీ వరకు చేపట్టిన రోడ్డు పనులు నిలిచి పోవడంతో వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో రాళ్లు తేలి, ధూళి ఎగురుతుండడంతో ప్రజలు ఇక్కట్లకు గురవు తున్నారు. కనీసం గ్రావెల్ వేసి చదును చేయాలని, శాశ్వతంగా పనులు పూర్తి చేయా లని వారు కోరుతున్నారు.

– వజ్రపుకొత్తూరు


చినవంక వద్ద రాళ్లు తేలిన రోడ్డు

రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలి

● 'ఉద్దాన ప్రభంజనం'లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష



'ఉద్దానప్రభంజనం'లో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, పాల్గొన్న ఇరు పార్టీల నేతలు, మహిళలు

పలాసరూరల్, మార్చి3: రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. నీలావతి గ్రామంలో ఆదివారం టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో 'ఉద్దానం ప్రభంజనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలకు 45 రోజుల సమయం మాత్రమే ఉందని, అందువల్ల టీడీపీ-జనసేన నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేసి కూటమి విజయానికి పాటు పడాలని కోరారు. జనసేన జిల్లా నాయకులు పి.చంద్రమోహన్, దానేటి శ్రీధర్, నియోజకవర్గం సమన్వయకర్త దుర్గారావు మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి దుర్మార్గపు పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలన్నారు. అంతకు ముందు ఉద్దానానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. ముందుగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రామకృష్ణాపురం నుంచి బైకు ర్యాలీతో సున్నాదేవి, రంగోయి, గురుదాసుపురం మీదుగా నీలావతి గ్రామానికి చేరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పలాస మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, నాయకులు వజ్జ బాబూరావు, పీరికట్ల విఠల్, దువ్వాడ హేమబాబుచౌదరి, టి.నర్సింహమూర్తి, కిక్కర డిల్లీరావు, సంతోష్ కుమార్, జనసేన నాయకులు సంతోష్ పండా, కోత పూర్ణచంద్రరావు, పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


రోడ్ల నిర్వహణ ఏదీ?

● దారుణంగా తయారైన రహదారులు
● మెయింటినెన్స్ నిధులపై అనుమానాలు

(టెక్కలి)

రోడ్ల నిర్వహణ (మెయింటినెన్స్) బాధ్యత ఆర్అండ్‌బీ శాఖది.. అయితే నిధులు విడుదలైనా పనులు చేపట్టకుండానే స్వాహా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రోడ్లు గతుకులమయమై దారుణంగా ఉన్నాయి. కనీసం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలాఖరు నాటికి నిర్వహణ పనులు పూర్తి కావాల్సి ఉన్నా ఈ ఏడాది ఆ పరిస్థితి కానరావడం లేదు. అసలు పనులు జరుగుతున్నాయా, లేదా అన్నది పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపి స్తున్నాయి. విశేషమేమిటంటే ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనిఎన్ఎం రోడ్డులో పడిన రంధ్రం కూడా పూడ్చలేని దుస్థితి నెలకొంది. నౌపడా-మెళియాపుట్టి రోడ్డు, టెక్కలి-తెంబూరు రోడ్డు, డీపీఎన్ రోడ్డు, టెక్కలి పట్టణంలో పలు రోడ్లపై గోతులు ఏర్పడి వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయినా నవ్విపోదురు గాక నాకేమిటి సిగ్గు అన్న చందంగా ఆర్అండ్‌బీ యంత్రాంగం తయారైంది. పట్టణ పరిధిలోనే రోడ్ల పరిస్థితే ఇలా ఉంటే గ్రామీణ రోడ్ల పరిస్థితి పెద్దగా చెప్పుకోవాల్సిన పనిలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి మెయింటినెన్స్ కింద ఒక కిలోమీటర్‌కు రూ.10 వేలు చొప్పున ఆర్అండ్ బీ కేటాయించినా ఎక్కడా గోతులు పూడ్చిన పరిస్థితి కనిపించడం లేదు. టెక్కలి పరిధిలో మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లకు రూ.6 లక్షలు, స్టేట్ హైవేకి రూ.5.50 లక్షలు సుమారు 15 శాతం లెస్సుకి కాంట్రాక్టర్ మెయింటినెన్స్ పనులు దక్కించుకున్నారు. అయితే ఆ పనులు జరుగుతున్నాయా, లేదా గుర్తించడంలో ఆర్అండ్‌బీ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ విష యమై ఆర్అండ్‌బీ ఏఈ సతీష్ వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా మెయిం టినెన్స్ పనులకు సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నామన్నారు. ఒక నెల రోజుల పాటు కాంట్రాక్టర్ ఈవోటీ తీసుకొని పనులు పూర్తి చేయాలని కోరామన్నారు.



టెక్కలి నడిబొడ్డున గోతులమయమైన రోడ్డు


నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో ఇలా..

నరకం

మండలంలోని పలు గ్రామాలకు చెందిన రోడ్లు దారుణంగా తయారయ్యాయి. కనీసం ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ముంగెన్నపాడు, బొత్తాడసింగి, కొమ్మువలస, జాడుపేట గ్రామాల రహదారులు దయనీయంగా తయారయ్యాయి. గోతులమయమై, రాళ్లుదేలి వాహనాలు సైతం తరచూ పాడవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-ఎల్ఎన్‌పేట


అధ్వానంగా ఉన్న ముంగెన్నపాడు రోడ్డు

ఎలుగుబంటి కలకలం


గడూరు రోడ్డుపై తిరుగుతున్న ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు: మందస మండలం గడూరు గ్రామానికి సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆదివారం ఎలుగుబంటి కలకలం సృష్టించింది. ఉదయం పది గంటల సమయంలో రోడ్డుపైకి వచ్చిన ఎలుగుబంటి వాహనదారులపై దాడి చేసేం దుకు వెంటపడి భయాందోళనకు గురిచేసింది. ఎటువంటి నష్టం వాటిల్లనప్పటికీ స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా ఇటీవల ఈ గ్రామానికి సమీపంలోని జీడి తోటలలో ఉన్న నలుగురిపై దాడి చేసి గాయపరచగా వారిలో ఇద్దరు తీవ్రంగాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తరచూ ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వస్తుండడంతో భయాందోళన నెలకొంది. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు స్పందించి ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

నందిగాం: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పెద్ద తామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు బాలక శంకరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల వన్యప్రాణుల ఆవశ్యకతను వివరించారు. వన్యప్రాణులను సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాస్కులు తొడిగి అవగాహన కల్పించారు.

సచివాలయాలతో సుపరిపాలన

పలాసరూరల్: సచివాలయాలతో పంచాయతీల్లో సుపరిపాలన అందిస్తున్నామని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. అమలకుడియాలో నూతన సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. గ్రామాల నుంచే పాలన అందించేందుకు వైసీపీ ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, సర్పంచ్ కొర్ల శిరీష, పీఏసీఎస్ చైర్మన్ పైల వెంకటరమణ, మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బీడీరావు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత కొండూరు


జిల్లాస్థాయి కబడ్డీ విజేత కొండూరు జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: గొదలాం గ్రామంలో నందెమ్మ తల్లి ఆలయ 56వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలో కొండూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన గా లీగ్ పద్ధతితో పోటీలు నిర్వహించారు. శివరాంపురం (వజ్రపుకొత్తూరు) ద్వితీయ, బాడపల్లి (మందస) తృతీయ స్థానాలు సాధించాయి. అలాగే నాలుగో స్థానంలో గొదలాం జట్టు నిలిచింది. వీరికి షీల్డ్‌లతో పాటు నగదు పురస్కారాన్ని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిలక ధనుంజయ్ కుమార్ అందజేశారు. రిఫరీగా గవరయ్య, శివాజీ, లచ్చయ్య, వెంకటరమణ, నారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అడ్డ తిరుపతి, అప్పలరాజు, గ్రామ పెద్దలు కూస భాస్కరరావు, పిలక రాంబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, సందికొత్తూరు గ్రామానికి చెందిన కర్రి లక్ష్మీనారాయణ S/o కర్రి మల్లేసుకు చెందిన పాస్‌పోర్ట్ నెంబర్ Y7704829 పలాస రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల కర్రి లక్ష్మీనారాయణకు గానీ, బారువా పోలీస్‌స్టేషన్‌కు గానీ అప్పగించాలని విజ్ఞప్తి. ఫోన్ నెంబర్:9542726482.

నాణ్యమైన ఆభరణాలు అందించాలి


జీఎన్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ షాపు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నరసన్నపేట, మార్చి 3: జ్యూయలరీ షాపులకు నరసన్నపేట ప్రసిద్ధి అని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నరసన్నపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన జీఎన్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ బంగారం షాపును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలుదారుల నమ్మకానికి అనుకూలంగా నాణ్యమైన ఆభరణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకులు కింజరాపు హరివరప్రసాద్, స్థానిక నాయకులు కేసీహెచ్ గుప్త, గొద్దు చిట్టిబాబు, యజమానులు గుడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.